క్లుప్తంగా

ఎమ్మెల్యే పరామర్శ

అగనంపూడి: అగనంపూడి నిర్వాసిత కాలనీ పెదమడకకు చెందిన వైఎస్సార్‌టీయూసీ నాయకుడు, ఉక్కు ఓబీసీ కార్యదర్శి గెద్దాడ అప్పలరాజు కుటుంబాన్ని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి సోమవారం పరామర్శించారు. అప్పలరాజు తండ్రి, మాజీ సైనికుడు గెద్దాడ అప్పారావు మృతి చెందడంతో, నాగిరెడ్డి ఆయన ఇంటికి వెళ్లి, ఓదార్చారు. మృతుని చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. ఎమ్మెల్యే వెంట కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి, నాయకులు ఇల్లపు ప్రసాద్, నక్కా రమణబాబు, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ బాధ్యతల స్వీకరణ


పూర్ణానందశర్మను అభినందిస్తున్న నాయకులు

అగనంపూడి: రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్‌గా అగనంపూడికి చెందిన గున్నంటి పూర్ణానందశర్మ (పూర్ణ) సోమవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. గొల్లపూడిలో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీనివాస శర్మ, దేవదాయ శాఖ ప్రభుత్వ సలహాదారు జె.శ్రీకాంత్, జీఎం నాగసాయి సమక్షంలో డైరెక్టర్‌గా ప్రమాణ పత్రం స్వీకరించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు యలమంచిలి అప్పారావు, పెదిరెడ్ల హరీష్, పురుషోత్తమ్, రవి, మధు, సుబ్బారావు, సాయి తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు


అగనంపూడి జూనియర్ కళాశాలలో తరగతులకు హాజరైన విద్యార్థులు

అగనంపూడి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ తరగతులను సోమవారం ప్రారంభించారు. ఇంటర్‌లో సబ్జెక్టులు తప్పిన, తక్కువ మార్కులు సాధించిన విద్యార్థులు ఈ తరగతులకు హాజరయ్యారు. ఇంటర్మీడియెట్ ఎడ్యుకేషన్ కమిషనర్ ఆదేశాల మేరకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామని ప్రిన్సిపాల్ సుశీల్‌కుమార్ తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించే తరగతులను విద్యార్థులు సద్వినియోగపర్చుకోవాలని కోరారు.

నేత్రపర్వంగా పైడితల్లి అమ్మవారి తొలేళ్ల ఉత్సవం


ఊరేగింపులో ఆకట్టుకున్న వేషధారణలు, ఏనుగు బొమ్మ

గోపాలపట్నం: గోపాలపట్నం వాసుల ఆరాధ్య దేవత పైడితల్లమ్మ ఉత్సవాలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. సోమవారం తొలేళ్ల పండగ ఘనంగా నిర్వహించారు. నూకాలమ్మ ఆలయం నుంచి సోమవారం సాయంత్రం ప్రతిమలను ఊరేగించారు. విచిత్ర వేషధారణలు, కాంతారా వేషధారణ చూపరులను ఆకట్టుకుంది. గోపాలపట్నం ప్రధాన రహదారి మీదుగా పలు వీధుల్లో ఊరేగించారు. అమ్మవారి ఆలయం వద్ద ప్రతిమలకు విశేష పూజలు చేశారు. ఈ ఊరేగింపులో ఆలయ ధర్మకర్త గణబాబు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కాంతులీనుతున్న ఆలయం
పైడితల్లి అమ్మవారి పండగ నేపథ్యంలో ఆలయాన్ని సుందరంగా ముస్తాబు చేశారు. ఆలయంతో పాటు పలు వీధుల్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు.

మే డే స్ఫూర్తితో ముందుకు..

- పునరుద్ఘాటించిన నాయకులు
- సంఘటితంగా హక్కుల పరిరక్షణకు పిలుపు
- వాడవాడలా కార్మిక దినోత్సవం


జెండా ఎగరవేస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

గాజువాక: మే డే స్ఫూర్తితో కార్మికులు ముందుకు సాగాలని నాయకులు కోరారు. సంఘటిత పోరాటాలతోనే హక్కుల రక్షణ సాధ్యమని, ఐక్యతే మన ఆయుధమని పిలుపునిచ్చారు. అంతర్జాతీయ కార్మిక దినోత్సవాన్ని గాజువాక ప్రాంతంలో సోమవారం వాడవాడలా నిర్వహించారు. మేడే వేడుకలను వివిధ కార్మిక సంఘాలు ప్రతిష్టాత్మకంగా నిర్వహించాయి. కార్మికవర్గంలో ఉద్యమ స్ఫూర్తిని నింపుతూ కార్యక్రమాలు జరిపాయి. ఆయా కార్మిక సంఘాల నాయకులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు సంబంధిత కార్యక్రమాల్లో పాల్గొని కార్మికులకు దిశా నిర్దేశం చేశారు. అమరుల త్యాగ ఫలితాలు ప్రతి కార్మికుడికీ చేరే విధంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

- సీఐటీయూ గాజువాక డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో మే డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. వివిధ జంక్షన్లు, కంపెనీల వద్ద ఎర్రజెండాలను ఆవిష్కరించి, కార్మికులకు మేడే శుభాకాంక్షలు తెలిపారు. నాయకులు ఎం.రాంబాబు, లోకేష్, గొలగాని అప్పారావు, రమణ, కిరీటం, శ్రీదేవి, సంతోషం, లెనిన్ తదితరులు పాల్గొన్నారు.


స్టీల్ ఐఎన్‌టీయూసీ వేడుకల్లో జెండా ఎగరవేస్తున్న రాజశేఖర్

- సీపీఐ ఆధ్వర్యంలో మేడే వేడుకలను నిర్వహించారు. ఆ పార్టీ సీనియర్ నాయకుడు, కార్పొరేటర్ ఎ.జె.స్టాలిన్ జెండాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు కసిరెడ్డి సత్యనారాయణ, జె.రామకృష్ణ, ఎల్లేటి శ్రీనివాస్, జి.ఆనంద్, పల్లేటి పోలయ్య, అప్పారి విష్ణుమూర్తి, కె.అచ్యుతరావు, కె.పోతన్న తదితరులు పాల్గొన్నారు.

పెదగంట్యాడ: కార్మికుల ఐక్య పోరాటానికి నిదర్శనమే మే డే అని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. స్టీల్ వైఎస్సార్‌టీయూసీ కాంట్రాక్ట్ కార్మిక సంఘం ఆధ్వర్యంలో పెదగంట్యాడ జంక్షన్‌లో కార్మిక దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో పిట్టా రెడ్డి, మార్టుపూడి పరదేశి, నక్కా వెంకటరమణ, సంపంగి ఈశ్వరరావు పాల్గొన్నారు.

- 76వ వార్డు రామచంద్రనగర్, రిక్షా కాలనీలో మే డే సందర్భంగా అరుణ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో కేఎం శ్రీనివాసరావు, ఎం.రాంబాబు, గాంధీనగర్, రామచంద్రనగర్, రిక్షా కాలనీ గ్రామ అధ్యక్షుడు కాతా బాలకృష్ణ, బలగా రామారావు, రాజారావు, నాయుడు పాల్గొన్నారు.
- సీపీఐ ఆధ్వర్యంలో పెదగంట్యాడలోని పోతిన సన్యాసిరావు భవన్ వద్ద సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యుడు స్టాలిన్ జెండా ఆవిష్కరించారు.


87వ వార్డులో జెండా ఎగరవేస్తున్న నాయకులు

- గంగవరం పోర్టు ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ)ఆధ్వర్యంలో గంగవరం పోర్టు గేటు వద్ద నిర్వహించిన వేడుకల్లో బి.జగన్, కొవిరి అప్పలరాజు, నొల్లి తాతారావు పాల్గొన్నారు.

కూర్మన్నపాలెం: శ్రీరామ భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో 87వ వార్డులో నిర్వహించిన మే డే వేడుకల్లో 86, 87, 88 వార్డుల కార్మికులు పాల్గొని, జెండా ఎగరవేశారు. సంఘం పూర్వ చైర్మన్ వి.వి.ఎస్.ఎం. రాజు, సీఐటీయూ నాయకుడు కె.ఎం. శ్రీనివాస్, వైఎస్సార్‌సీపీ నాయకుడు మాడిశ అప్పలరాజు, సీఐటీయూ నాయకుడు విశ్వనాథ్ తదితరులు ప్రసంగించారు.

- 79వ వార్డు అగనంపూడి సత్రం కూడలిలో మహాత్మాగాంధీ సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో సంఘం అధ్యక్షుడు చిత్తా రామారావు పతాకాన్ని ఎగరవేశారు. ఎల్.రాంబాబు, ఎస్.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌లో..

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ సీఐటీయూ ఆధ్వర్యంలో ఉక్కు ప్రధాన పరిపాలన భవనం వద్ద, యూనియన్ కార్యాలయం వద్ద, జనరల్ ఆస్పత్రి వద్ద, సెక్టార్1,2,11 కాంప్లెక్స్‌ల వద్ద మే డే వేడుకలు నిర్వహించారు. జెండా ఎగరవేశారు. నాయకులు ఎన్‌రామారావు, జె.అయోధ్యరామ్, వై.టి.దాస్, యు.రామస్వామి, బి.అప్పారావు, శ్రీనివాసరాజు, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

- స్టీల్ ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో యూనియన్ కార్యాలయం వద్ద ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్ జెండా ఎగర వేశారు. యూనియన్ అధ్యక్షుడు నీరుకొండ రామచంద్రరావు, బి.ఎస్.రాజు, సంపూర్ణం, వేణువర్మ తదితరులు పాల్గొన్నారు.


రామచంద్రనగర్ రిక్షా కాలనీలో..

- స్టీల్ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో స్టీల్‌ప్లాంట్ మెయిన్ గేటు, సెక్టార్-1 కాంప్లెక్స్ తదితర ప్రాంతాల్లో యూనియన్ ప్రధాన కార్యదర్శి డి. ఆదినారాయణ జెండా ఎగరవేశారు. నాయకులు కె.ఎస్.ఎన్.రావు, జె.రామకృష్ణ, డి.నర్సింగరావు, కె. రాజబాబు తదితరులు పాల్గొన్నారు.
- స్టీల్ వైఎస్సార్‌టీయూసీ ఆధ్వర్యంలో ఉక్కునగరం కార్యాలయం వద్ద నిర్వహించిన వేడుకల్లో ఎమ్మెల్యే నాగిరెడ్డి జెండా ఎగరవేశారు. మస్తానప్ప,దాలినాయుడు, రమణతదితరులు పాల్గొన్నారు.
- ఉక్కు శ్రామిక సంఘం ఆధ్వర్యంలో హిల్ టాప్ కూడలి వద్ద అమృతరావు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బొడ్డు పైడిరాజు, కరణం సత్యారావు, బొడ్డు రమణ, గుమ్మాల నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

అక్కిరెడ్డిపాలెం: భెల్ (హెచ్‌పీవీపీ) ప్రవేశ గేటు వద్ద సిటూ ప్రధాన కార్యదర్శి జి.టి.పి.ప్రకాష్, గుర్తింపు యూనియన్ ప్రధాన కార్యదర్శి ఉరుకూటి బాబూరావు అరుణ పతాకాన్ని ఎగరవేశారు. వర్షంలో తడుస్తూనే మే డే ప్రతిజ్ఞ చేశారు. యూనియన్ నాయకులు ఎస్.జగన్నాధరావు, కె.పవన్ కుమార్, కె.దేముడు, వి.ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

- 69వ వార్డు తుంగ్లాంలో కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి జెండా ఎగరవేశారు. అక్కిరెడ్డిపాలెంలో సీపీఎం నాయకులు రామాలయం వద్ద, మున్సిపల్ కార్యాలయం వద్ద మే డే నిర్వహించారు. ఆటోనగర్‌లో సిటూ నాయకులు జెండా ఎగరవేశారు.

వైభవంగా వేంకటేశ్వర కల్యాణం


మాంగల్యధారణ ఘట్టాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

అల్లిపురం: ప్రసన్న వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాన్ని సోమవారం కనులపండువగా జరిపించారు. వైశాఖ శుద్ధ ఏకాదశిని పురస్కరించుకుని బల్లిగిరిపై శ్రీదేవి, భూదేవిలతో స్వామి పరిణయ వేడుకను వేదమంత్రోచ్చరణల నడుమ శాస్త్రోక్తంగా నిర్వహించారు. కల్యాణోత్సవాల్లో భాగంగా ముందుగా ఆలయ అర్చకుడు గొడవర్తి రఘునాథాచార్యుల ఆధ్వర్యంలో సోమవారం ఉదయం అంకురార్పణ, గరుడ పతాకం ధ్వజస్తంభ అధిరోహణం, విశేష హోమాలు జరిపించారు. దేవదాయ శాఖ తరఫున ఆలయ కార్యనిర్వహణాధికారి జి.వి.రమాబాయి పట్టువస్త్రాలు అందజేశారు. సాయంత్రం స్వామివారు, దేవేరుల ఉత్సవ మూర్తులను చూడచక్కగా అలంకరించి, తిరువీధి ఉత్సవం నిర్వహించారు. అనంతరం కల్యాణోత్సవాన్ని వైభవంగా జరిపించారు. అధిక సంఖ్యలో జంటలు కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. వారికి వేదపండితులు ఆశీర్వచనాలు అందించి, తీర్థప్రసాదాలు అందజేశారు.

అప్పన్నకు ఆర్జిత సేవలు

సింహాచలం: ఏకాదశిని పురస్కరించుకుని శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం ఆర్జిత సేవలు ఘనంగా జరిగాయి. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు స్వర్ణ తులసీ దళార్చన శాస్త్రోక్తంగా నిర్వహించారు. 108 స్వర్ణ తులసీ దళాలతో స్వామికి అష్టోత్తరశతనామావళి పూజ చేశారు.

- శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం గరుడసేవ విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని గరుడవాహనంపై స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని అధిష్ఠింపజేసి అష్టోత్తరశతనామావళి పూజ నిర్వహించారు.

జోరువానలో యువ కార్మికుల నిరసన

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ యువ కార్మికులు తమ డిమాండ్ల సాధన కోసం జోరువానలోనూ నిరసన తెలిపారు. సెయిల్ కార్మికులకు నూతన వేతన ఒప్పందం అమలు కాగా, విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో కార్మికులకు రెండున్నరేళ్లు పూర్తయినా ఇంతవరకు అమలు కాలేదు. దీంతో ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న కార్మికులు సంఘాలకు అతీతంగా ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా మే డే సందర్భంగా ఉక్కు హిల్‌టాప్ కూడలి వద్ద ఉదయం 8 నుంచి 9 గంటల వరకు ప్లకార్డులు, బ్యానర్లు ప్రదర్శిస్తూ నినదించారు. వేతన ఒప్పందం అమలు చేయాలని, ఎల్‌టీసీ, ఎల్ఎల్‌టీసీ, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్‌లు పునరుద్ధరించాలని నినాదాలు చేశారు. గుర్తింపు సంఘం వెంటనే వేతన ఒప్పందం అమలుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జాప్యం జరిగితే ఆందోళన ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో యువ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


ఉక్కు హిల్‌టాప్ కూడలి వద్ద నిరసన తెలుపుతున్న యువ కార్మికులు

ఘనంగా వైవీ సుబ్బారెడ్డి జన్మదిన వేడుకలు


కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి


వైవీ సుబ్బారెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న దేవన్‌రెడ్డి తదితరులు

పెదగంట్యాడ: తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్, వైఎస్సార్‌సీపీ రీజనల్ కో–ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి జన్మదిన వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పెదగంట్యాడలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో మార్టుపూడి పరదేశి, నక్కా వెంకటరమణ, సంపంగి ఈశ్వరరావు, పిట్టా రెడ్డి, వెంకటేష్, అప్పలరెడ్డి, గొందేశి రాము, నందికి తాతారావు తదితరులు పాల్గొన్నారు.

శుభాకాంక్షలు
టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డికి వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి సోమవారం జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. హైదరాబాద్‌లోని సుబ్బారెడ్డి నివాసానికి వెళ్లి, పుష్పగుచ్ఛాలు, పండ్లు అందజేశారు. కార్యక్రమంలో ఆళ్ల శివగణేష్, బోగాది సన్యాసిరావు, జీలకర్ర నాగేంద్ర పాల్గొన్నారు.

కూర్మన్నపాలెం: 86వ వార్డు పరిధిలో వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి, పార్టీ రాష్ట్ర అదనపు కార్యదర్శి దామా సుబ్బారావు కార్యాలయంలో సుబ్బారెడ్డి జన్మదినోత్సవం నిర్వహించారు. కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు వెలుగుల పరశురాముడు, జేసీఎస్ మండల ఇన్‌చార్జి వాడపల్లి రామచంద్రరాజు, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అకాల వర్షం

- లోతట్టు ప్రాంతాలు జలమయం
- యారాడలో కూలిన విద్యుత్ స్తంభం


యారాడ గ్రామంలో కూలిన విద్యుత్ స్తంభం


వుడా కాలనీ చర్చి దరి బురదమయమైన రోడ్డు


విద్యుత్ వైర్లపై పడిన తాటిచెట్టు

పెదగంట్యాడ: మండు వేసవిలో కురిసిన అకాల వర్షానికి పెదగంట్యాడ మండలంలోని పలు రహదారులు జలమయమయ్యాయి. సోమవారం ఉదయం నుంచి వర్షం పడుతూనే ఉండడంతో పలు ప్రాంతాల్లో నీరు నిలిచిపోయి, వాహనచోదకులు, పాదచారులు ఇబ్బంది పడ్డారు. హౌసింగ్ బోర్డు కాలనీ, బర్మా కాలనీ, రామచంద్రనగర్, రిక్షా కాలనీ, డెయిరీ కాలనీ తదితర లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి.

తాటిచెట్టు పడి కూలిన స్తంభం
భారీ వర్షం కారణంగా యారాడ గ్రామంలో సోమవారం ఒక విద్యుత్ స్తంభం కుప్పకూలింది. చర్చి సమీపంలోని ఓ తాటిచెట్టు విరిగి, విద్యుత్ తీగలపై పడడంతో విద్యుత్ స్తంభం నేలకొరిగింది. వైర్ల తాకిడికి మిగిలిన స్తంభాలు ఒరిగిపోయాయి. దీంతో గ్రామంలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. వీఆర్వో యశ్వంత్ ఏపీఈపీడీసీఎల్ అధికారులకు సమాచారమిచ్చారు. ఏఈ పిచ్చయ్య ఆధ్వర్యంలో వైర్లను తొలగించి, విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు చర్యలు చేపట్టారు.

హార్బర్ ఏసీపీ మోసెస్ పాల్ బాధ్యతల స్వీకరణ



జగదాంబ : హార్బర్ ఏసీపీగా మోసెస్‌పాల్ సోమవారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. గుంటూరు సీసీఎం విభాగంలో మోసెస్ పాల్ పని చేశారు. బదిలీపై హార్బర్ ఏసీపీగా వచ్చిన ఆయన సోమవారం షిప్‌యార్డ్ కమర్షియల్ కాంప్లెక్స్‌లోని ఏసీపీ కార్యాలయంలో చార్జ్ తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయనను మల్కాపురం సీఐ లూథర్‌బాబు ఇతర అధికారులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఇక్కడి ఏసీపీ శిరీషా గుంటూరుకు బదిలీ అయ్యారు.

వర్షంలోనూ పింఛన్ల పంపిణీ

మొదటి రోజు 74.67శాతం పూర్తి

గాజువాక: జీవీఎంసీ గాజువాక జోన్‌లో పింఛన్ల పంపిణీ సోమవారం జోరుగా సాగింది. 20వార్డులున్న గాజువాక జోన్‌లో సచివాలయాల వారీగా వలంటీర్లు తొలిరోజే 74.67 శాతం పింఛన్ల పంపిణీ పూర్తి చేసినట్లు జీవీఎంసీ యూసీడీ విభాగం అధికారులు తెలిపారు. నగరంలోనే పెద్ద జోన్‌గా ఉన్న గాజువాకలో మొత్తం 31,142 మంది వృద్ధాప్య, వితంతు, దివ్యాంగ పింఛనుదారులున్నారు. ఈ నెల మొదటి రోజే వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి 23,255 మందికి అందజేశారు. కొంత మంది లబ్ధిదారులు ఇళ్ల వద్ద అందుబాటులో లేకపోవడంతో వారు ఎక్కడున్నదీ తెలుసుకొని అక్కడికి వెళ్లి అందజేశారు. సచివాలయ సిబ్బందికి గృహ సారథులు, సచివాలయాల కన్వీనర్లు కూడా సహకరించడంతో పింఛన్ల పంపిణీ మరింత వేగవంతమైందని సంబంధిత అధికారులు తెలిపారు.

- 67వ వార్డులో జేసీఎస్ కన్వీనర్ ఎస్ఎండీ గౌస్ పర్యవేక్షణలో వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు పింఛన్లను అందజేశారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ సయ్యద్ నసీరుద్దీన్, వైఎస్సార్‌సీపీ నాయకులు సర్దార్ ఖాన్, జహీర్ తదితరులు పాల్గొన్నారు.

79వ వార్డులో..

అగనంపూడి: ఉదయం నుంచి జోరు వాన కురుస్తున్నా వలంటీర్లు, వార్డు సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు అర్హుల ఇంటికి వెళ్లి పింఛన్లు అందించారు. 79వ వార్డు గళ్లవానిపాలెంలో సచివాలయ కన్వీనర్ మామిడి శ్రీను, వలంటీర్, గృహ సారథి ఉదయం 9 గంటల లోపే పింఛన్లు అందజేశారు. ప్రశాంతినగర్ పరిధిలో సచివాలయ కన్వీనర్ నెల్లి రమణమ్మ, గృహ సారథి కుప్పిలి ప్రసాద్ పర్యవేక్షణలో పింఛన్ల పంపిణీ జరిగింది.


పింఛన్ అందజేస్తున్న వలంటీర్ తదితరులు


గళ్లవానిపాలెంలో వృద్ధురాలికి పింఛన్ అందిస్తున్న వలంటీర్, సచివాలయ కన్వీనర్

షేక్‌బానుకు పింఛన్ మంజూరు

ఆరోగ్యశాఖ మంత్రి ఆదేశాలతో పునరుద్ధరణ

పెదగంట్యాడ: జీవీఎంసీ 77వ వార్డు ఇస్లాంపేటకు చెందిన షేక్ బానుకు పింఛన్ మంజూరైంది. మంత్రి ఆదేశాలతో వెంటనే పింఛన్ రావడంతో ఆమె ఆనందానికి అవధుల్లేవు. వివరాలివీ.. షేక్ బాను భర్త 20 సంవత్సరాల క్రితమే విడిచిపెట్టి వెళ్లిపోవడంతో, చెట్టు కింద చిన్న తడకల ఇంట్లో నివాసం ఉంటోంది. గతంలో ఆమెకు ఒంటరి మహిళ పెన్షన్ వచ్చేది. అయితే, రెండేళ్ల క్రితం సాంకేతిక కారణాలతో పింఛన్ నిలిచిపోయింది. అధికారులకు దరఖాస్తు చేసినా పింఛన్ పునరుద్ధరణ కాకపోవడంతో గత నెలలో యూపీహెచ్‌సీ ప్రారంభోత్సవానికి వచ్చిన ఆరోగ్య శాఖామంత్రి విడదల రజినికి ఆమె మొర పెట్టుకున్నారు. దీంతో స్పందించిన మంత్రి రజిని వెంటనే ఆమెకు పెన్షన్ మంజూరు చేయాలని కలెక్టర్ ఎ.మల్లికార్జునను ఆదేశించిన విషయం తెలిసిందే. మంత్రి ఆదేశాల మేరకు ఆమెకు మే నెల 1వ తేదీన సోమవారం పెన్షన్ ఇవ్వడంతో ఆనందం వ్యక్తం చేశారు. మంత్రికి, కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.


పింఛన్ పునరుద్ధరించాలని మంత్రిని కోరుతున్న షేక్‌బాను (ఫైల్)

పక్షుల కోసం నీటి కుండలు


చెట్టుకు నీటి కుండలు కడుతున్న జేడీ ఫౌండేషన్ సభ్యులు

గోపాలపట్నం: ఎండలు మండుతున్న నేపథ్యంలో పక్షులు సేద తీరేందుకు చెట్లపై నీటి కుండల్ని గోపాలపట్నం జేడీ ఫౌండేషన్ సభ్యులు ఏర్పాటు చేశారు. ఈ మేరకు సోమవారం గోపాలపట్నం రైతు బజారులో చెట్లకు మట్టి కుండల్లో నీరు నింపి కట్టారు. కార్యక్రమంలో గ్లోబల్ హిందూ హెరిటేజ్ ఫౌండేషన్ సభ్యులు, పిన్నమనేని శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు ఉద్యమం మరింత ఉధృతం

కూర్మన్నపాలెం: భావితరాలను అంధకారంలోకి నెట్టే ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ నిర్ణయాలకు వ్యతిరేకంగా జరుగుతున్న ఉక్కు ఉద్యమం మే డే స్ఫూర్తితో మరింత ఉధృతం కానుందని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు సోమవారం నాటికి 809వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు పాల్గొని, సంఘీభావం తెలిపారు. ముందుగా కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉక్కు ఉద్యమం కోసం కోసం ప్రాణత్యాగాలు చేసిన కార్మికులను స్మరించి, నివాళులర్పించారు. నాయకులు మాట్లాడుతూ కార్మిక శక్తికి ఎటువంటి నియంతైనా దిగి రావాల్సిందేనన్నారు. ఇప్పటికైనా కేంద్రప్రభుత్వ పెద్దలు విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ నిర్ణయాన్ని విరమించుకోవాలని కోరారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.


809వ రోజు ఉక్కుదీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన నేడు

డాబాగార్డెన్స్: బురుజుపేటలో కొలువైన కనకమహాలక్ష్మికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు జరిగే ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. భక్తులు యూనియన్ బ్యాంక్ అకౌంట్ నంబర్ 060810011006681 టౌన్‌కొత్త రోడ్డు బ్రాంచ్, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081కు ఆన్‌లైన్ పేమెంట్ చేసి, పేరు, గోత్రం తెలిపితే వారి పేరిట పూజ చేస్తారు. వివరాలకు 0891-2711725, 2566514 నంబర్లలో సంప్రదించవచ్చు.

14న క్రీస్తు రక్షకుని యాత్రా మహోత్సవం

డాబాగార్డెన్స్: జ్ఞానాపురం రక్షణగిరి పుణ్యక్షేత్రంలో ఈ నెల 14న క్రీస్తు రక్షకుని యాత్రా మహోత్సవం నిర్వహించనున్నట్టు ఆర్‌సీఎం విశాఖ అగ్రపీఠాధిపతి డాక్టర్ మల్లవరపు ప్రకాష్ తెలిపారు. సెయింట్ ఆంథోనీ ఉన్నత పాఠశాల సమీపాన గల పునీత ఆంథోనీ దేవాలయం ఆవరణ బిషప్ హౌస్‌లో కార్యక్రమ పోస్టర్‌ను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1986 నుంచి ఈ పండగ ఘనంగా నిర్వహిస్తూ వస్తున్నామన్నారు. ఈ నెల 5 నుంచి 13 వరకు ప్రతి రోజూ సాయంత్రం 5 గంటలకు దివ్యబలిపూజ జరుగుతుందని చెప్పారు. పూజా కార్యక్రమాలను ఉత్తరాంధ్ర జిల్లాలోని చర్చ్ ఫాదర్లు నిర్వహిస్తారని తెలిపారు. పునీత పేతురు ప్రధాన దేవాలయం విచారణ కర్తలు, రక్షణగిరి పుణ్యక్షేత్రం డైరెక్టర్ ఫాదర్ జొన్నాడ జాన్ ప్రకాష్, 12న గుంటూరు బిషప్ చిన్నబత్తిన భాగయ్య, 13న విశాఖ అగ్రపీఠాధిపతి మల్లవరపు ప్రకాష్, 14న కార్డినల్ హైదరాబాద్ అగ్రపీఠాధిపతి ఆంథోనీ పూల ప్రత్యేక దివ్యబలిపూజ నిర్వహించనున్నారని చెప్పారు. మహోత్సవానికి ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి విశ్వాసులు పాల్గొంటున్నారని, సుదూర ప్రాంతాల నుంచి వచ్చే వారికి భోజన సదుపాయాలు కల్పించనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో పీపీసీ సభ్యులు బూర శేషుబాబు, ఆదిరెడ్డి చార్లీ, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.